క్లుప్తంగా

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి



చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జొహరాపురం 2 యూపీహెచ్‌సీ పరిధిలోని కమ్మ స్ట్రీట్ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇచ్చి, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మాధవి, డీపీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక మందులపై వర్క్‌షాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు మెడికల్ కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఆధునిక మందులపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జోనల్ సీఎంఈలో ఫార్మకో థెరపీ ఇన్ స్పెషల్ పాపులేషన్ అనే అంశంపై చర్చించారు. దీంతో పాటు ఇటీవల కిడ్నీ, మానసిక వ్యాధులు, స్త్రీ వ్యాధులకు వచ్చిన మందులకు సంబంధించి సవివరంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాజేష్, వైద్యులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): వైద్య విద్యార్థులకు శాపంగా మారిన నేషనల్ టెస్టు ఏజెన్సీని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, బి.మహేంద్ర డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నీట్ పరీక్షపై గందరగోళం నెలకొన్న కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కొందరు ఎన్‌టీఏ అధికారుల సహకారంతోనే నీట్ పరీక్షా పేపర్ లీక్ అయినట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రమణ, మునిస్వామి, హరి, రఘు, అస్లాం, రాజు, నబీరసూల్‌పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖ నెలకొల్పిన టవర్లపై 33కేవీ లైన్ లాగే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం కూడా టవర్లపై లైన్ లాగుతున్నందున వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ నాగప్రసాద్ తెలిపారు. శ్రీకృష్ణ కాలనీ, అశోక్ నగర్, లేబర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్: కల్కి 2898 ఏడీ, డెస్పికబుల్ మి4,కిల్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కల్కి 2898 ఏడీ, భారతీయుడు
ఐనాక్స్ : కల్కి 2898 ఏడీ, డెస్పికబుల్ మి4
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : కల్కి 2898 ఏడీ, మహారాజ
శ్రీరామ :మహారాజ
రాజ్ : కల్కి 2898 ఏడీ
భరత్ కాంప్లెక్స్ : 14
ఆనంద థియేటర్ : కల్కి 2898 ఏడీ
విక్టరీ టాకీస్: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం
- ఏడాదిలోపు టీడీపీ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత తప్పదు
- పార్టీ పూర్వవైభవానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



హాజరైన కార్పొరేటర్లు, నాయకులు

కర్నూలు (టౌన్): 'ఏ తప్పులు చేయని కార్యకర్తలే మన పార్టీకి కొండంత బలం. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. అధైర్య పడాల్సిన అవసరం లేదు. అన్నివిధాలుగా అండగా ఉంటా'మని మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు ఉందన్నారు. శనివారం స్థానిక బీఏఎస్ కళ్యాణ మండపంలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన వైస్సాఆర్‌సీపీ కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని 2019 ఎన్నికల్లో టీడీపీకి 23 సీట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం శ్రీలంకగా మారుతుందని చంద్రబాబు దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు ఆయన ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి అమ్మకు వందనం, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, 50 ఏళ్లకే పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇలా అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేసేందుకు దేశ బడ్జెట్ సరిపోదన్నారు. ఎన్నికల్లో ఎలాగైన గెలవాలని హామీలు గుప్పించారన్నారు. పాఠశాలలు తెరవగానే అమ్మకు వందనం ఇస్తామని చెప్పి.. ఇప్పటి వరకు ఆచరణలో పెట్టలేదన్నారు. వచ్చే ఆరు నెలల్లోనే టీడీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొక తప్పదన్నారు. 2012 సంవత్సరంలో జగనన్నకు అండగా ప్రతి కార్యకర్త పనిచేశాడని, ఇప్పుడు కూడా ఆ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్‌లో వైఎస్సార్‌సీపీ పాలన మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ అనతి కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ ప్రగతిని ప్రజలకు వివరించి మళ్లీ కౌన్సిల్‌లో పట్టు నిలబెట్టుకుందామన్నారు. ఇందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. బయట వచ్చే పుకార్లు నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో 40 శాతం ఓట్లు ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే తెలుగుదేశం కూటమి పాలన గాడితప్పిందన్నారు. దీనిని ప్రజల పక్షాన నిలబడి ఎండగడదామని పిలుపునిచ్చారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో వైస్సార్‌సీపీ ఓటమి ఊహించని పరిణామమన్నారు. ఆందోళన చెందకుండా పార్టీ పూర్వ వైభవం కోసం శ్రమిద్దామన్నారు. సేవ చేస్తారని ప్రజలు టీడీపీకి అధికార మిస్తే..వారు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, బెదిరింపులకు దిగుతున్నారన్నారు. నగర పాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ కష్ట కాలంలో పార్టీకి అండగా నిలుద్దామన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన తెలుగుదేశం వాటిని తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌కు మించి పథకాలు ప్రకటించారన్నారు. అధికార పక్షాన్ని నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ కలిసి కట్టుగా ఉంటూ పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. తన వంతుగా ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో నగరపాలక డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, పార్టీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: శ్రీలలితా పీఠం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకుడు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అధ్యక్షతన ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఉదయం 9 నుంచి 1 గంట వరకు జరిగే ఈ సమావేశంలో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమం స్వామీజీ విరజానంద, ఆశీః ప్రసంగం చేస్తారని తెలిపారు. మహానంది క్షేత్రం కాశిరెడ్డి నాయన ఆశ్రమం స్వామీజీ నిత్యానంద భారతీ,కందిమల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వామి 8వ తరం మునిమనుమడు నొస్సం వీరం భట్లయ్య స్వామి, ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని తెలిపారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సమావేశం అనంతరం మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. హిందువుల ఐక్యత, హిందూ ధర్మ పరిరక్షణ, ఆలయాలు, వాటి ఆస్తుల పరిరక్షణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజినల్, మునిసిపల్, మండల కార్యాలయాల్లో కూడా జరుగుతుందని వెల్లడించారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని పద్మచంద్ర నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జులై ఒకటి నుంచి 31వ తేది వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని అనే నినాదంతో నివారణ, నియంత్రణ చర్యలు వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఉన్నట్లుండి జ్వరం ఉధృతంగా రావడం, తలనొప్పి అధికంగా రావడం, కంటిలోపల నొప్పి, కంటి కదలికలు తగ్గడం, కన్ను కదలినప్పుడు నొప్పి ఎక్కువ అవడం, కండరాలు, కీళ్లనొప్పి, వాంతి అగునట్లు భ్రాంతి కలగడం, నోరు ఎండిపోవడం, ఎక్కువ దాహం కావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి ఆర్బోవైరస్ వల్ల సంక్రమిస్తుందని, ఒకరి నుంచి మరొకరికి ఏడిస్ ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ దోమలు పగలు మాత్రమే కుడతాయని, మన ఇంటి పరిసరాల్లో నీరు నిలిచేందుకు అవకాశం ఉండి ఆ నీరు కనీసం వారం రోజులు నిల్వ ఉంటే ఈ దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి, ఏఎంఓ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మాధవి, నర్సింగ్ కళాశాల ఏవో సిద్దిక్, సూపర్‌వైజర్లు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్త వహించాలి



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పెంపుడు జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వరల్డ్ జోనసిస్ దినం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి వచ్చే వ్యాధులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీహెచ్‌సీలలో ఉన్న వ్యాక్సిన్‌ల గురించి తెలిపారు. ప్రజలు ఈ వ్యాక్సిన్‌ను ఏ జంతువు అయినా కరిచినప్పుడు దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వేయించాలని చెప్పారు. డిస్ట్రిక్ట్ సర్వలెన్స్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వీధి కుక్కకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కుక్కకాటును నివారించేందుకు చిట్కాలు, కాటు వేసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కుక్క కాట్ల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15400 నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి టీకా షెడ్యూల్ గురించి, వీధి కుక్కలకు టీకాలు వేయడం, జంతువుల జనన నియంత్రణ గురించి వివరంగా తెలిపారు. ఈఅవగాహన కార్యక్రమాలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి హేమలత, డెమో సెక్షన్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఏపడమాలజిస్టు జి. వేణుగోపాల్, ఎపడమిక్ సెల్ హెచ్‌పీ చలపతి, ఎంపీహెచ్‌ఈవో, సూపర్‌వైజర్ ఎస్.మోక్షేశ్వర్ పాల్గొన్నారు.

10న కార్మిక సమస్యలపై ధర్నా

కర్నూలు(సెంట్రల్): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా తెలిపారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో వేర్ హౌస్ హమాలీ యూనియన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ..నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. నూతన పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను ప్రవేశపెట్టాలన్నారు. వెంటనే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విజయుడు, ఎం.జయన్న, మల్లికార్జున, చెన్నయ్య, నాగరాజు, సామేలు, రాజు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో బోధన

కల్లూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్వామిరెడ్డి నగర్, ఎంజీ నగర్ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాశాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. పాఠశాలలో పిల్లలకు విద్యార్థుల కిట్లను పంపిణీ చేశారు. అనంతర ఉర్దూ మీడియం పుస్తకాలను ఎంఆర్‌సీ భవనంలో పరిశీలించారు.

ఈత కొలనులో మరిన్ని సౌకర్యాలు



కమిషనర్ భార్గవ తేజను సన్మానిస్తున్న స్విమ్మింగ్ పూల్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని ఈత కొలనులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ అన్నారు. స్విమ్మింగ్ పూల్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ భార్గవ తేజ, సెట్కూరు సీఈఓ పీవీ రమణ, డీఎస్‌డీఓ బి.భూపతిరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్విమ్మింగ్ మంచి వ్యాయామం అన్నారు. నేను కూడా ఇదే ఈతకొలనులో ఈత నేర్చుకున్నానన్నారు. సెట్కూరు సీఈఓ రమణ మాట్లాడుతూ అందరి సహకారంతో ఈతకొలను నిర్వహణ మెరుగ్గా ఉందన్నారు. డీఎస్‌డీఓ భూపతిరావు మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్ ఆడిటర్ బుచ్చన్న మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఈత కొలను అద్భుతంగా తయారైందన్నారు. కార్పొరేషన్ నిధులు సుమారు రూ.25 లక్షలతో అన్ని రకాల సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ ప్రతినిధులు సందడి సుధాకర్, రాజశేఖర్ గౌడ్, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, విట్టల్ శెట్టి, స్విమ్మింగ్ మాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ సెక్రటరీ జి.రామకృష్ణ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ సర్వేష్ గౌడ్, ట్రెజరర్ దస్తగిరి, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

కర్నూలు సిటీ: పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఉపాధ్యాయులు పోరాట స్ఫూర్తి, ఉ విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని 7వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ జోబి ఫిలిప్ అన్నారు. శనివారం నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల బాధ్యత అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎడిఫై వరల్డ్ స్కూల్ డైరెక్టర్లు డా.మనోజ్‌కుమార్, డా.సతీష్ విద్యార్థుల్లోని నాయకత్వ ప్రతిభను చూసి అభినందించారు. ఆ తరువాత స్కూల్ లీడర్ ఎంపికకు ఎన్నికలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్, ప్రిన్సిపాల్ అడ్వైజర్ లక్ష్మీ నాయర్, విద్యార్థులు, పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలి

కర్నూలు(సెంట్రల్) : అమెరికా సాయంతో ఇజ్రాయెల్ దేశం పాలస్తీనాపై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపేందుకు ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకులు అర్లప్ప, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపాలు, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామన్న, రమేష్, అజయ్, వినయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్నూలు సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో శనివారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ పాల్గొని ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. చిన్న వయస్సులోనే పర్యావరణ పరిరక్షణ గురించి తెలుసుకునేందుకు విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్‌బాషాను బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లోని చాంబరులో కలెక్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, అధికార ప్రతినిధి సాయిప్రదీప్, నాయకులు ఉపేంద్ర, నవీన్‌కుమార్ కలిశారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచి కరువు రహితంగా మార్చాలని, కర్నూలును అభివృద్ధిపథంలో నడిపించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

తెలంగాణ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, ఆటోను సీజ్ చేసిన సెబ్ సిబ్బంది

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టు బడింది. కర్నూలు సెబ్ స్టేషన్ ఎస్‌ఐ రెహనా బేగం ఆధ్వర్యంలో కర్నూలు శివా రు టోల్‌ప్లాజా సమీపంలోని అంతర్ రాష్ట్ర ఆర్‌టీఓ చెక్‌పోస్టు వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అలంపూరు వైపు నుంచి వస్తున్న ఒక ఆటో ను ఆపి తనిఖీ చేయగా అందులో 144 తెలంగాణ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఆటోలో ఉన్న ఉల్చాల గ్రామానికి చెందిన ఆవుల రాజేష్‌ను అదుపు లో కి తీసుకుని విచారించగా తమ గ్రామంలో వ్యాపార నిమిత్తం తీసుకెళ్తున్నట్లు తెలిపారు.మద్యంతో పాటు ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రవాణా దారుడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

డాక్టర్ వైఎస్ఆర్ వజ్రోత్సవాల పోస్టర్ విడుదల

కర్నూలు(సెంట్రల్): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో వజ్రోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ వేడుకలకు అఖిల భారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు. విజయవాడలోని మంగళగిరిలో జరిగే ఈకార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మంత్రిమూలింటి మారెప్ప,అనంతరత్నం మాదిగ, సయ్యద్‌నవీద్,వెంకటసుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి తొలిమెట్టు



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్

కర్నూలు సిటీ: ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి తొలి మెట్టు అని, ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ అన్నారు. నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జితేందర్ సింగ్ హాజరై ప్రసంగించారు. డిగ్రీ పట్టా తీసుకుని బయటి ప్రపంచంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యత ఇస్తాయన్నారు. అనంతరం రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ కళాశాలలోకి తల్లిదండ్రుల చాటు బిడ్డలుగా వచ్చి నేడు వారి ముందు గర్వంగా డిగ్రీ పట్టా తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు కాంగ్రెస్ పార్టీ ఘన నివాళి అర్పించింది. ఆయన 35వ వర్ధంతిని పురస్కరించుకొని డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె. బాబురావు నేతృత్వంలో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌ఎస్ రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, నాయకులు ఉండవెల్లి వెంకటన్న, అనంత రత్నం మాదిగ, రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, ఈ.లాజర్ ఎస్.ప్రమీళ పాల్గొన్నారు.

నాటక రంగ సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు కల్చరల్: నాటక రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ఎమ్మెల్యే జయ నాగేశ్వరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని నాటక రంగ సమస్యలు కళాకారుల ఇబ్బందులు తనకు పూర్తిగా తెలుసన్నారు. కళాకారుల వృద్ధాప్య పెన్షన్‌పై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి అర్హులైన వారికి ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. కళాకారులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, గురుమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఇసుక అందుబాటులో ఉంచండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి రానుండడంతో అందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక నిల్వ, టన్నుల వారీగా. ధరల వివరాలను వెబ్‌సైట్లో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, అదనపు ఎస్పీ నాగరాజు, డీఆర్వో కె. మధుసూదన్‌రావు, డీపీఓ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

కల్లూరు: పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే నగర శివారు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు తారకేశ్వర్‌రెడ్డి, రంగస్వామి కోరారు. శనివారం వారు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మాధవి నగర్‌లో కలసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నూలు మున్సిపాలిటీకి ఎక్కువగా కల్లూరు అర్బన్ వార్డుల నుంచే ఆదాయం వస్తుందన్నారు. అయితే, ఈ ప్రాంతానికి తాగునీటి సరఫరా మాత్రం సరిగా జరగడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, జగదీష్, రవికుమార్, మధన మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.